బాధిత కుటుంబాలకు పరామర్శ


బజార్‌హత్నూర్ : స్వేశిక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

బజార్‌హత్నూర్, మార్చి 4: మండల కేంద్రానికి చెందిన ఏఆర్ఎస్ఐ కొత్త లక్ష్మణ్ కుమారుడు స్వేశిక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న సోమవారం బజార్‌హత్నూర్‌కు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కొత్త శంకర్, చట్ల ఉత్తమ్, మాజీ ఎంపీటీసీ నారాయణ ఉన్నారు.

బోథ్, మార్చి 4: అందూర్ గ్రామానికి చెందిన రాజుబాయి, గుర్రాలతండా ఎంపీటీసీ మహేందర్ బంధువులు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు.ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బీ శ్రీధర్ రెడ్డి, కొడప విజయ్, ఎంపీటీసీ జుగాదిరావ్, రోహిదాస్, భీముడు, చంద్రమోహన్ ఉన్నారు.

బోథ్ : అందూర్‌లో రాజుబాయి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఇంద్రవెల్లి : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

ఇంద్రవెల్లి, మార్చి 4: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన్‌గూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుభద్ర, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, మార్చి 4: ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో సోమవారం అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి చిన్నారులను గుర్తించి పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఎవరైనా చిన్నారులు తప్పినట్లయితే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇచ్చోడ వైద్యాధికారి సాగర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షలను బాధ్యతతో రాయండి

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షులు

బోథ్, మార్చి 4: మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు మున్సిఫ్ మాట్లాడుతూ పరీక్షలను విద్యార్థులు భయంతో కాకుండా బాధ్యతతో రాయాలని పేర్కొన్నారు. పరీక్షలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ప్రేమ్, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాభాలనిచ్చే.. శనగ సాగు..

- మద్దతు ధర రూ.5335
- మార్కెట్‌లో రూ.6వేలు


సాగు చేస్తున్న శనగ పంట

బోథ్, మార్చి 4 : శనగ పంట పండింది. దిగుబడి తగ్గిన మద్దతు ధర కలిసి వస్తున్నది. మార్కెట్‌లో రూ. 6 వేల వరకు పలుకుతున్నది. బోథ్ మండలంలో యాసంగి పంట కింద రైతులు 9230 ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. వానకాలం పంట కింద సాగు చేసిన సోయాబీన్ పూర్తి కావడంతో గత నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ పంటను వేశారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చిన రైతులు ఆ పనులు పూర్తి చేసి నూర్పిడి చేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని రైతులు తెలిపారు. ఈ యేడు మాత్రం పంట సాగు సమయంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పాటు ఎండు తెగులు వ్యాప్తి అధికంగా ఉండడంతో దిగుబడి కొద్దిమేర తగ్గిందని పేర్కొంటున్నారు. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు సరాసరి దిగుబడి వస్తున్నదని పేర్కొంటున్నారు. పంట సాగు కోసం ఎకరానికి విత్తనాలు, దుక్కులు, రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ, కోతలు, నూర్పిడి వంటి వాటి కోసం రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు పెట్టుబడి రూపేనా ఖర్చయిందంటున్నారు. ప్రభుత్వం శనగలకు క్వింటాల్‌కు రూ. 5335 ప్రకటించగా ప్రస్తుతం మార్కెట్‌లో పంటకు డిమాండ్ ఉండడంతో రూ.5900 నుండి రూ 6వేల వరకు పలుకుతున్నది. ఈ లెక్కన ఎకరానికి పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.20 వేల వరకు మిగులుతున్నట్లు పేర్కొంటున్నారు. వానకాలం పంట కింద సాగు చేసిన సోయాబీన్ అంతంత మాత్రంగానే పండిన ఆ భూముల్లో సాగు చేసిన శనగ పంట మూలంగా లోటు పూడిందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

కోసిన శనగలను నూర్పిడి చేయిస్తున్న రైతు

ఎకరానికి ఆరు క్వింటాళ్ల దిగుబడి

ఎకరానికి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మూడున్నర ఎకరాల్లో పంట సాగు చేశా. నూర్పిడి పనులు పూర్తి చేసి పొలంలోనే ఆరబెట్టాను. ధర రూ 6 వేల వరకు పలుకుతుండడంతో ఈ యేడు పంట లాభం తెచ్చిపెట్టింది. ఎకరానికి పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.15 వేల వరకు మిగిలే పరిస్థితులు కనబడుతున్నాయి.

-పీ రవీందర్‌రెడ్డి, రైతు, కౌఠ (బీ)

సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎల్‌పీవో ప్రభాకర్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఈవో సంజీవరావ్, పంచాయతీ సిబ్బంది

ఇంద్రవెల్లి, మార్చి 4: గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది, వివిధ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీవో జీవన్‌రెడ్డి, పంచాయతీ ఈవో సంజీవరావ్‌తో పాటు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది శంకర్ లాల, నారాయణ, సంజీవ్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

పూజలు అందుకున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

తాంసి, మార్చి 4 : పొన్నారి గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కన్నాజి నర్సింగ్ చారి మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా జాదవ్ అనిల్ గెలువాలని ఎన్నికలకు ముందు అమ్మవారిని వేడుకున్నామని అన్నారు. ఎమ్మెల్యేగా జాదవ్ అనిల్ గెలుపొందడంతోనే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నామని తెలిపారు. జూన్ 16వ తేదీన ఆలయ వార్షికోత్సవాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

ఉట్నూర్ రూరల్, మార్చి 4: టైగర్‌జోన్ పరిధిలోని అడవిలో వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని బీర్సాయిపేట్ అటవీ శాఖ రేంజ్ అధికారి గులాం మొయినొద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అడవిలో చెట్లు నరికిన, ఇసుక, మట్టి, బండలు తరలించిన, అక్రమ కలప రవాణా చేసిన, నిప్పు పెట్టిన, వన్యప్రాణులను వేటాడిన తెలంగాణ అటవీ చట్టం 1967 ప్రకారం, వన్యప్రాణుల సంరక్షణ 1972 చట్టం ప్రకారం ఏడు సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని అన్నారు. అటవీని కాపాడుకునేందుకు సిబ్బంది నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అడవిలో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు పడేయవద్దని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అడవిని కాపాడుటలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ఈ విషయాలు ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

నేడు నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక సమావేశం

తాంసి, మార్చి 4: మండలంలో ఎండాకాలంలో ప్రజలకు నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు హాజరుకావాలని కోరారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా సంప్రదించాలని సూచించారు.

మండలంలో పర్యటించనున్న ఎమ్మెల్యే

తాంసి, మార్చి 4: మండలంలోని పొన్నారి గ్రామంలో మంగళవారం అభయాంజనేయ స్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొంటారని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. ఉదయం 9 గంటలకు అభయాంజనేయ స్వామి మహాయజ్ఞంలో పాల్గొని అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలి

సీసీరోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పీఆర్ డీఈ పవార్ రమేశ్

ఇంద్రవెల్లి, మార్చి 4: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో పూర్తి నాణ్యతను పాటించాలని పీఆర్ డీఈ పవార్ రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మాజీ మండలాధ్యక్షుడు నాగోరావ్, నాయకులు ఉన్నారు.

ముగిసిన బాజీరావ్ బాబా సప్తాహ వేడుకలు

వివిధ వేషధారణలో ఎండ్ల బండిపై చిన్నారులు

జైనథ్, మార్చి 4: కామాయి గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బాజీరావ్ బాబా సప్తాహ వేడుకలు సోమవారం భక్తి శ్రద్ధలతో ముగిశాయి. గ్రామస్తులు, మహిళలు నృత్యాలు చేస్తూ వివిధ దేవతల వేషధారణలో ఉన్న చిన్నారులను ఎడ్ల బండిపై ఊరేగించి పలు భక్తి పాటలతో నృత్యాలు చేశారు. బాబా పల్లకీని ఊరేగించారు. గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కేతిరెడ్డి, సురేందర్ రెడ్డి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు చెల్లించాలి

మాట్లాడుతున్న బ్యాంక్ మహారాష్ట్ర మేనేజర్ అర్జున్

జైనథ్, మార్చి 4: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు ద్వారా మహిళలు తీసుకున్న రుణాలు నెలనెల చెల్లించాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గిమ్మ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ సూచించారు. సోమవారం రాంపూర్(టీ)లో పెండింగ్‌లో ఉన్న స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం సభ్యులు పుస్తక నిర్వహణ, సమావేశాలు నెలనెల పెట్టుకున్నారన్నారు. నెలనెల డబ్బులు చెల్లిస్తే వడ్డీ లేని రుణాలు పొందవచ్చన్నారు. సమావేశంలో ఏపీఎం భగవాండ్లు, సీసీ గంగారాం, వీవోఏ రాజు, వీవో లీడర్లు నర్సమ్మ, రేణుక, మాజీసర్పంచ్ లింగన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్, సంఘం నాయకులు

ఎదులాపురం, మార్చి 4 : తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్‌వన్ ఆదిలాబాద్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ సోమవారం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏమైన ఉంటే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి రఘురాం, ముఖ్యసలహాదారుడు బ్రహ్మానంద్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమణాచారి, సహ అధ్యక్షుడు ఎం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రవీందర్, నాయకులు అక్బర్, వెంకట్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సంతోష్ వెంకటరమణ, ప్రమోద్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

సంప్రదాయంగా గిరిజామాత పూజలు

గిరిజామాత ఆలయం

భీంపూర్, మార్చి 4 : భీంపూర్ మండలంలోని సరిహద్దు పెన్‌గంగ ఒడ్డున ఉన్న పురాతన గొల్లగడ్ గిరిజామాత ఆలయంలో సోమవారం ఆదివాసీ కుటుంబాలు సంప్రదాయంగా పూజలు నిర్వహించారు. తుడుం, డోలు వాయిద్యాలతో భజనకీర్తనలు చేశారు. దేవికి, గంగమ్మకు నైవేద్యం సమర్పించి సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామాలు పాడిపంటలతో వర్ధిల్లాలని, పశుసంతతి వృద్ధి కావాలని కోరుకున్నారు. ఈ పూజల్లో తాంసి(కే), గొల్లగడ్, నిపాని, భీంపూర్, గుంజాల గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

నర్సరీల పెంపకంపై అలసత్వం వద్దు

దస్తురాబాద్, మార్చి4 : నర్సరీల పెంపకంపై అలసత్వం చూపవద్దని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. పెర్కపల్లెలో సోమవారం నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, ఎరువుల తయారీని పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ తయారు చేసిన ఎరువులను మొక్కలకు అందించాలని సూచించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ దసరా లక్కీ స్కీమ్ డ్రా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 4: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా వివిధ సేవలు కొనసాగిస్తున్నామని రీజినల్ మేనేజర్ సోల్మన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ దసరా లక్కీ స్కీం డ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి డీటీసీ శ్రీనివాస్ హాజరై లక్కీ చీటీలను తీసి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీ డ్రా తీస్తున్న ఇన్‌చార్జి డీటీసీ శ్రీనివాస్

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం,మార్చి 4 : ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతీ, యువకులకు ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఐదు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ www.tsstudycircle. co.in వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఐదు నెలల ఉచిత శిక్షణలో గ్రూపు-2,3,4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే మూడు నెలల పాటు గ్రూపు-1కు ఎస్సీ యువత 100 మంది దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ కోర్సులో రూ.2500 విలువైన పుస్తకాలు, 12 నోటు బుక్స్, కాస్మోటిక్ చార్జీలు ప్రతి ఒక్కరికీ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

7న జాబ్‌మేళా

ఎదులాపురం, మార్చి 4 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 7వ తేదీన సాత్నాల క్వార్టర్స్ వద్దనున్న జిల్లా ఉపాధి కార్యాలయంలో వివిధ ప్రైవేట్ కంపెనీలోని ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి రూ.12,500 నుంచి రూ.15 వేలు ఇతర అలవెన్స్‌లు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 30 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7659978443, 8019537030ను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, మార్చి 4 : తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. http://tgrdccet.cgg.gov.in లో మార్చి 2 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 28వ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షకు 695 మంది గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 4: ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ వార్షిక పరీక్ష (మ్యాథమెటిక్స్, బొటనీ, పొలిటికల్ సైన్స్) సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 695 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీంద్రకుమార్ పేర్కొన్నారు. మొత్తం 10519 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9824 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు.

జీరో బిల్లు రానివారు వివరాలు ఇవ్వాలి

భీంపూర్, మార్చి4: గృహజ్యోతి కింద ఇంకా జీరో బిల్లులు రాని వినియోగదారులు వారి ఆధార్, తెల్లకార్డు, ప్రజాపాలన దరఖాస్తు , కరెంట్ బిల్లు ప్రతులు, ఫోన్ నంబర్లు ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాలని ఏఈ కొమ్మూవార్ శ్రావణ్‌కుమార్, రీడర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులంతా సకాలంలో ఇవి అందజేయాలని గుర్తు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ, మార్చి 4: సిరికొండ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

ముగిసిన ప్రగడ్ దివస్ పూజలు

భీంపూర్, మార్చి 4 : మహారాష్ట్ర శేగావ్ క్షేత్ర సంత్ గజానన్ మహారాజ్ ప్రగడ్ దివస్(కనిపించిన రోజు) ఉత్సవాలు, పూజలు సోమవారం ముగిశాయి. భీంపూర్ మండలం కరంజి(టీ) భక్తులు సమీప మహారాష్ట్ర నాగాపురం గజానన్ మహారాజ్ మందిరానికి పల్లకీతో వెళ్లారు. అలాగే పలు గ్రామాల భజనబృందాల సభ్యులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

బోథ్, మార్చి 4: పట్నాపూర్ గ్రామానికి చెందిన మదావి సురేందర్ (39) ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సురేందర్ కొద్ది నెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి భరించలేక రెండు రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య రమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

దాతలు ముందుకు రావాలి

నార్నూర్, మార్చి 4 : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుద్ధజల యంత్రాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావాలని వైద్య సిబ్బందితో పాటు రోగులు వేడుకుంటున్నారు. ఈ దవాఖానలో నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మారుమూల గ్రామాల నుంచి రోగులు, ప్రసవ నిమిత్తం గర్భిణులు వచ్చినప్పుడు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు కొనుగోలు చేస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నారు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే బాధితులు పేదలు కావడంతో మార్కెట్‌లో శుద్ధజలం కొనుగోలు చేయలేని పరిస్థితి. దాతలు ముందుకు వచ్చి దవాఖానలో శుద్ధజలం యంత్రాన్ని అందించాలని వారు కోరుతున్నారు.

కేంద్రప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

ఖానాపూర్, మార్చి 3: ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేటర్లకు కొమ్ము కాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవనంలో జరిగిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ఓటుతో సమాధానం చెప్పాలని సూచించారు. డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు లక్ష్మణ్, వెంకటేశ్, స్వామి పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కుంటాల, మార్చి, 4 : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని కోరుతూ జిల్లాలోని ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) ఆధ్వర్యంలో ఈ మెయిల్ ద్వారా పీఆర్‌సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సీపీఎస్ రద్దు చేయాలని ఈ మెయిల్ ద్వారా జిల్లాలోని వేలాది మంది ఉద్యోగులు విజ్ఞప్తులు పంపినట్టు జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు.